క్లుప్తంగా


అధిక వర్షాల్లో పంట జాగ్రత్త



పంట పొలాలు పరిశీలిస్తున్న ఏఓ ప్రసాద్‌రావు

తాళ్లూరు (దర్శి): అధిక వర్షాల సమయంలో మెళకువలు పాటించాలని ఏఓ ప్రసాద్‌రావు సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని రెడ్డి సాగర్, వెలుగు వారి పాలెం గ్రామాల్లో పంట పొలాలను ఆదివారం పరిశీలించారు. ప్రసాద్‌రావు మాట్లాడుతూ కోస్తా ఆంధ్రకు వర్ష సూచన ఉందన్నారు. అల్పపీడన ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ సూచించిన కారణంగా రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. 30 రోజుల్లోపు నారు మడి నీటమునిగితే మునిగిన 4-5రోజుల్లోపు నీటిని బయటకు తీసివేసి పంటకు గాలి తగిలేలా చేయాలన్నారు. తెగుళ్లు ఆశించకుండా పూర్తిగా నీటిని తీసివేసి మొక్క నిలదొక్కుకున్న తర్వాత ఒకటి లేదా రెండు గ్రాముల కార్బండిజం, మాంకోజబ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వీఏఏ సుష్మ సుల్తాన పాల్గొన్నారు.

నాగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



నాగమ్మతల్లి మూల విరాట్

కురిచేడు: స్థానిక శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వరస్వామి ఆలయం వద్ద వేంచేసి ఉన్న శ్రీ వల్లిదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర నాగమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కురిచేటి సుబ్బరాయ శర్మ ఆధ్వర్యంలో దేవి వరన్నవరాత్రులు ముగింపు సందర్భంగా పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మద్యం దరఖాస్తుదారులకు నేడు లాటరీ

గిద్దలూరు రూరల్: ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి నేడు ఒంగోలులోని అంబేడ్కర్ భవనంలో లాటరీ ద్వారా దుకాణాలు కేటాయిస్తారని స్థానిక ఎక్సైజ్ సీఐ జయరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 13 షాపులకు గాను 232 మంది దరఖాస్తు చేసుకున్నారని వారంతా ఒంగోలుకు సోమవారం ఉదయం 7.30 గంటలకు తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం

మార్కాపురం రూరల్: మార్కాపురం పట్టణ శివార్లలోని గుండ్లకమ్మ నది ఒడ్డున ఉన్న శ్రీ లక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీనివాస కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 22 మంది ఉభయదాతలు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారు, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చక్కా మాలకొండ నరసింహారావు, ఊటుకూరి రామకృష్ణ, కోశాధికారి పొదర్తి శ్రీనివాసులు తదితరుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నవితరణ నిర్వహించారు.

స్నేహితుల ఆపన్నహస్తం

బేస్తవారిపేట: భర్తను కోల్పోయి ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న తోటి స్నేహితురాలికి ఆర్థిక సహకారాన్ని తోటి స్నేహితులు కలిసి అందించారు. బేస్తవారిపేట మండలంలోని పిటికాయగుళ్లకు చెందిన సూరబోయిన రాధకు 1997-98 పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.55 వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. భర్తను కోల్పోయి ఇద్దరు పిల్లలతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తోటి స్నేహితులు గమనించి చేయూతనిచ్చారు. భవిష్యత్‌లో అండగా ఉంటామని భరోసానిచ్చారు.

పోలీసుస్టేషన్‌లో ఆయుధపూజ

మార్కాపురం టౌన్: స్థానిక పోలీసుస్టేషన్‌లో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్సైలు సైదుబాబు, అంకమరావు, ఏఎస్సైలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, మునాఫ్ తదితరుల ఆధ్వర్యంలో ఆయుధ పూజ చేశారు. పోలీసు అధికారులతో అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. పూజల్లో పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా ?

- వర్షానికి అధ్వానంగా మారిన రోడ్లు
- నరక ప్రాయంగా ప్రయాణం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



గంగవరంలో రోడ్డు పై చెరువును తలపిస్తున్న వర్షం నీరు

తాళ్లూరు(దర్శి): తాళ్లూరు మండలంలో రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. వర్షానికి రోడ్లు పెద్ద గుంతలుగా ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గంగవరం నుంచి తాళ్ళూరు వెళ్ళే రోడ్డు, రాజంపల్లి నుంచి బొద్దికూర పాడు వెళ్ళే రోడ్డులో పెద్ద గుంతలు పడి రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గంగవరంలో వర్షం పడితే రోడ్డులోనే నీరు నిలచి పోతోంది. ఎక్కడ గుంట ఉందో ఎక్కడ రోడ్డు బాగుందో తెలియని పరిస్థితి నెలకొంది. పెద్ద వాహనాలు వెళ్ళేప్పుడు ఆనీరు పాద చారులపై , ద్విచక్ర వాహనదారులపై పడి తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గంగవరం నుంచి లింగాల పాడు మధ్య ప్రయాణం సాగించాలంటే ప్రయాణికులకు నరక ప్రాయంగా మారింది. ఎక్కడ గుంతలు ఉన్నయో అర్థం కాక వాహనదారులు నానా ఇక్కట్లు పడుతున్నారు. ఆటోలు సైతం తరచూ ప్రయాణం చేయాలంటే వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. రాత్రి పూట ప్రయాణం చేయాలంటే ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించపోయి గుంతల్లో పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. గంగవరం పట్టణంలో వర్షానికి చెరువులను సైతం తలపిస్తోంది. మండలంలో వాణిజ్యం కేంద్రం కావడంతో వాహన రాకపోకలు ఎక్కువగా ఉంటున్నాయి. సైడు కాలువల్లో పూడిక తీతలు తీయక కొద్ది పాటి వర్షానికే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. మురుగు నీరు వర్షం నీరు కలిసి రోడ్లపై మురుగు తాండవం చేస్తోందని ప్రజలు వాపోతున్నారు.మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



గంగవరం నుంచి తాళ్లూరు వెళ్లే రోడ్డులో వర్షానికి రోడ్డు పై ఉన్న నీరు



లింగాల పాడు వద్ద రోడ్డు దుస్థితి



కొత్తపాలెం వద్ద రోడ్డు పై ఏర్పడ్డ పెద్ద గుంత

వివాహ వేడుకలో బూచేపల్లి

దర్శి: పట్టణంలోని వైఎస్సార్ సీపీ నాయకులు గంజి అంజిరెడ్డి కుమారుని వివాహ వేడుకలకు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శనివారం హాజరయ్యారు. వధూవరులకు అక్షతలు వేసి ఆశీర్వదించారు. శివప్రసాద్‌రెడ్డితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వివాహ రిసెప్షన్‌కు..

ముండ్లమూరు (దర్శి): మండలంలోని నాయుడు పాలెం గ్రామానికి చెందిన సోషల్ మీడియా కార్యకర్త మీరా వలి వివాహ రిసెప్షన్ వేడుకలకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. వారికి వివాహ వేడుక శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ సుంకరసునీతా బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరయ్యారు.

పూజా కార్యక్రమాలకు..

తాళ్లూరు(దర్శి): విజయ దశమి పండగ పురస్కరించుకుని లక్కవరం గ్రామంలో శ్రీ దుర్గమ్మతల్లి ఊరేగింపు కార్యక్రమానికి దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



ఊరేగింపు కార్యక్రమంలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



దర్శి:వధూవరులను ఆశీర్వదిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



నాయుడు పాలెంలో శుభాకాంక్షలు తెలుపుతున్న బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

కస్తూర్బాలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

దొనకొండ: స్థానిక కస్తూర్బా గురుకుల విద్యాలయంలో ఖాళీగా ఉన్న 7 బోధనేతర సిబ్బంది పోస్టులను ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. హెడ్‌కుక్‌లు 2, అసిస్టెంట్ కుక్‌లు 4, చాకీదార్, చాకీదార్ 1 పోస్టులకు మహిళా అభ్యర్థులు అర్హులు. 1 జూలై 2024 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. చౌకీదార్ పోస్ట్‌కు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు 15వ తేదీలోపు వారి దరఖాస్తులను మండల విద్యాధికారి కార్యాలయంలో అందించాలి. విద్యార్హత, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి.



త్రిపురాంతకంలో రాజరజేశ్వరి అలంకారంలో ..



పుల్లలచెరువులో శ్రీరాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు



వైపాలెం: ధనలక్ష్మి అలంకరణలో దర్శనం ఇస్తున్న వాసవీ అమ్మవారు



కురిచేడు: శ్రీ వాసవికన్యకాపరమేశ్వరి దేవి గ్రామోత్సవం

వైభవంగా దసరా ఉత్సవాలు



దర్శి: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు



దర్శి: దర్శనం ఇస్తున్న కనకదుర్గమ్మ



గంగవరంలో దర్శనం ఇస్తున్న గుంటి గంగా భవాని అమ్మవారు



ముండ్లమూరులో భ్రమరాంబికా అమ్మవారు



పెద్దారవీడు: ప్రత్యేక అలంకరణలో రాజ్యలక్ష్మి అమ్మవారు

దర్శి: యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాల్లో దసరా మహోత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. నిజరూపంతో ఆలయాల్లో అమ్మవారు దర్శనం ఇచ్చారు. ఈసందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాలను గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. కలశాలు నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా మహిళలు తరలివెళ్లారు. దర్శి పట్టణంలోని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో, పట్టణంలోని దద్దాలమ్మ, వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారితో పాటు దర్శి మండలంలోని పలు ఆలయాలు పోటెత్తాయి.

పెద్దారవీడు: మండలంలో రాజంపల్లి గ్రామం సమీపంలో శ్రీగొ(ద్రా)లికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో దసరా పండుగ సందర్భంగా రాజ్యలక్ష్మి అమ్మవారికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారు ఇంటి ముందుకు రాగానే మహిళలు బిందెతో నీళ్లు వారుపోసి కాయ కర్పూరం సమర్పించారు. మండలంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

పుల్లలచెరువు: స్థానిక రామాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ ఏర్పాటు చేశారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మగా బతుకమ్మను పూజిస్తారు. బతుకమ్మ ప్రతిమకు ఊరేగింపు నిర్వహించి, స్థానిక కాటివీరన్న చెరువు వద్ద పూజలు చేసి నిమజ్జనం చేశారు.

త్రిపురాంతకం: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు శ్రీబాలాత్రిపురసుందరీదేవి రాజరాజేశ్వరి దేవి అలంకారంలో గ్రామోత్సవం జరిగింది. పూర్ణాహుతి కార్యాక్రమంతో ప్రత్యేక పూజలు ముగిశాయి.

పెద్దదోర్నాల: శరన్నవరాత్రుల ముగింపు ఉత్సవాల్లో భాగంగా విజయదశమి రోజున స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వాసవి మాత అమ్మవారు విజయలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

పుల్లలచెరువు: దేవీనవరాత్రుల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహించారు. శనివారం రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

యర్రగొండపాలెం: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు భక్తులకు విజయ ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారిని రూ. 50 లక్షల కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. సీఐ ప్రభాకరరావు, ఎస్సై చౌడయ్యలు ఆయుధ పూజలు చేశారు.

కురిచేడు: స్థానిక శ్రీ వాసవికన్యకాపరమేశ్వరి దేవి గ్రామోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

దొనకొండ: కనకదుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈశ్వరీదేవి.. రాజరాజేశ్వరీగా దర్శనమిచ్చారు. నరసింహానాయునిపాలెంకు చెందిన యర్రమరెడ్డి పిచ్చిరెడ్డి, రమాదేవి దంపతులు హోమ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషా మురళీ దపంతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏఈ షేక్ నాగూర్‌వలి సమక్షంలో పూజలు నిర్వహించారు.



పుల్లలచెరువులో బతుకమ్మకు ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



త్రిపురాంతకం గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు



దొనకొండ: ఆనంద ఆశ్రమ హోమంలో పాల్గొన్న ఎంపీపీ దంపతులు



దర్శి: అలరించిన కోలాటం ప్రదర్శనలు



దర్శి: కలశాలతో ఊరేగింపుగా మహిళలు



వైపాలెం: ఆయుధ పూజ చేస్తున్న సీఐ, ఎస్సైలు



పెద్దదోర్నాల మండలం ఐనముక్కలలో గ్రామదేవత పోలేరమ్మకు బోనాలు

వరుణుడు కోసం ప్రత్యేక పూజలు



పోలేర మ్మ అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న మహిళలు



మద్దలకట్టలో ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు

పెదాదరవీడు: మండల పరిధిలో మద్దలకట్ట గ్రామంలో వర్షాలు బాగా కురవాలని భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం గ్రామంలో సీతారాములస్వామిని నూతన పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం స్వామి వారిని మేళతాళాలతో వీధుల్లో ఊరేగింపు చేశారు. స్వామి వారికి మహిళలు నైవేద్యం, కాయకర్పూరం సమర్పించారు. ఊరి చివర గ్రాస్తులంతా వన భోజనాలు చేశారు. ఆదివారం పోలేరమ్మకు మహిళలు పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. మహిళలు ఇంటి వద్ద నైవేద్యం తయారు చేసి ఊరేగింపుగా పోలేరమ్మ వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, పట్టుచీర, పూలమాలతో అలంకరించారు. స్వామి, అమ్మవారికి వర్షాలు బాగా కురిసి పాడి పంటలు అభివృద్ధి చెంది సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రజలు వేడుకున్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



నాటిగురువులతో పూర్వ విద్యార్థులు

కురిచేడు: స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలిశారు. పదో తరగతి తరువాత ఎక్కడెక్కడో స్థిరపడిన వారు చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకునేందుకు నాటి చదువుల సరస్వతి నిలయం వైఆర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. కొందరు తమ కుటుంబాలతో హాజరు కాగా కొందరు ఒంటరిగా హాజరయ్యారు. అరె.. ఒరే అంటూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆటపాటలతో సరదాసరదాగా సాయంత్రం వరకు గడిపారు. కార్యక్రమానికి హైదరాబాదు, బెంగళూరు, అమెరికా తదితరప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు హాజరయ్యారు.



నాటిగురువులను సన్మానించుకుంటున్న విద్యార్థినులు